క్లుప్తంగా

రేపటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

మాకవరపాలెం : ఉపాధి పనులపై ఈ నెల 19 నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీతతామహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 2023–24 ఏడాదిలో రూ.20 కోట్ల 37 లక్షల ఉపాధి నిధులతో వివిధ రకాల పనులు చేపట్టామన్నారు. వీటిపై బుధవారం నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేపడతాయన్నారు. తనిఖీల్లో గుర్తించిన అంశాలను చివరగా నిర్వహించే ప్రజా వేదికలో తనిఖీ బృంద సభ్యులు వెల్లడిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గ భవానీ సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట

మాడుగుల రూరల్: మాడుగుల పార్థసారథి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన విజయదుర్గ భవానీ, సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మాడుగులకు చెందిన దుక్కా రమణారెడ్డి, సత్యవతి దంపతులు, నవీన్‌రెడ్డి రుక్మిణీదేవి కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో శాస్త్రోక్తంగా ప్రతిష్టించి, పూజలు నిర్వహించా రు. శ్రీ విజయదుర్గ భవానీ, పార్వతీదేవి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, మహాశివుడు, నంది విగ్రహాలు ప్రతిష్టా కార్యక్రమాన్ని సింహాచలం దేవస్థానం పండితులు ఆకెళ్ల శ్రీకాంత్‌శర్మ తదితరులు నిర్వహించారు. పూజలు అనంతరం, భక్తులకు అన్నసమారాధన జరిపారు.

ఏఎల్‌పురంలో సీసీ రోడ్డు పనులు



రోడ్డు పనులు ప్రారంభం చేస్తున్న దృశ్యం

గొలుగొండ: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఏఎల్‌పురం సర్పంచ్, జిల్లా వైస్సార్‌సీపీ పార్టీ మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చిటికెల తారక వేణుగోపాల్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన సూర్యచంద్ర ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు.

11 గ్రామాల్లో ప్రకృతి సేద్యం



స్టాల్‌లో ఉంచిన పంటలను తిలకిస్తున్న ఎంపీడీవో, తదితరులు

మాకవరపాలెం : మండలంలోని 11 గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ఏవో చిరంజీవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన ఉత్పత్తులను సోమవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు సేంద్రియ, ప్రకృతి సాగుపై దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. అంతేకాకుండా ఆరోగ్యకరమైన పంటను పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామమహాలక్ష్మి, ప్రకృతి సేద్య సిబ్బంది కవిత, సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

కె.కోటపాడు: శాంతిభద్రతలను అదుపులో ఉంచడంతో పాటు ప్రజల భద్రతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కె.కోటపాడు సీఐ పి.పైడపునాయుడు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ లో సోమవారం మండలంలో గ్రామ సచివాలయా ల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో దొంగతనాలు జరగకుండా ప్రజలను అప్రమత్తంగా ఉంచా లని సూచించా రు. గుళ్లల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. దొంగతనాలు జరిగే సమయాల్లో ఆధారాలను సేకరించడంతో పాటు భద్రపర్చే సమయాల్లో జాగ్రత్తలను మహిళా పోలీసులకు వివరించారు. వేసవి సెలవుల్లో ఊళ్లు వెళ్లే వారి ఇళ్ల చిరునామాలు ముందుగా పోలీసులకు తెలపాలన్నారు. సమావేశంలో కె.కోటపా డు, ఎ.కోడూరు ఎస్ఐలు ఆర్.ధనుంజయ్, డి.లక్ష్మీనారాయణ, జిల్లా క్లూస్ టీం హెడ్ కానిస్టేబుల్ త్రినాథ్ పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

దేవరాపల్లి: జీడి పిక్కలకు కేజీకి రూ. 200 మద్దతు ధర ప్రకటించి, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కనుగోలు చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర డిమాండ్ చేశారు. చింతలపూడి గ్రామ సచివాలయం ఎదుట గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన రైతులతో కలిసి సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డి. వరుణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం వరి, చెరకు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుందని, జీడికి మాత్రం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. ప్రైవేటు వ్యాపారులు దీనిని ఆసరాగా తీసుకొని రైతులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. గిట్టుబాటు ధరతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో జె.ఈశ్వరరావు, మూల గుమ్మి ఎర్రునాయుడు పాల్గొన్నారు.

జీడి పూత రాలిపోతోంది...



మంచు కారణంగా మాడిపోతున్న జీడిపూత

అరకొరగా పండిన జీడిపిక్కకు నల్లమచ్చ

రైతన్నల ఆశలపై మంచు దెబ్బ

అరకొరగా కాచిన జీడిపిక్కలకు మాడు తెగులు

దిగుబడిపై సన్నగిల్లుతున్న ఆశలు

నాతవరం : జీడిరైతులపై ప్రకృతి కన్నెర్ర చేయడంతో ఆశించిన విధంగా పూత నుంచి పిందెలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 24 మండలాల్లో జీడి మామిడి తోటలు 70వేల ఎకరాలకు పైగా రైతులు సాగు చేస్తున్నారు. నాతవరం మండలంలో అధికంగా 10వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. జిల్లా రూరల్ ప్రాంతంలో వరి, చెరకు తర్వాత అధికంగా రైతులు జీడిమామిడి తోటలు పండిస్తున్నారు. ఈఏడాది జనవరి నుంచి నేటి వరకు ఉదయం సమయంలో దట్టమైన మంచు కురియడంతో ఏపుగా పెరుగుతున్న జీడి పూత మాడిపోతోంది. పిందెకట్టే సమయంలో ప్రకృతి మంచు రూపంలో జీడి రైతులు ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. జీడి తోటలకు రైతులు పురుగుమందులు పిచికారి చేసినా ఫలితం లేక పూత మాడిపోయింది. అరకొరగా పండుతున్న జీడి పిక్కలకు నల్లమచ్చ రావడంతో దిగుబడి తగ్గడమే కాకుండా మార్కెట్లో గిరాకీ తగ్గిపోతుందని రైతులు దిగాలు చెందుతున్నారు.

ప్రైవేటు వ్యాపారులే దిక్కు

రైతులు పండించిన జీడి పిక్కలను అమ్ముకునేందుకు ప్రభుత్వం సౌకర్యం కల్పించలేదు. దీంతో దళారులు ప్రైవేటు వ్యాపారులకు జీడి పిక్కలు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జీడి పంట సమయంలో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారి రేటు పెరగకుండా చేస్తున్నారు. అందువల్ల ప్రభుత్వం నేరుగా జీడి రైతుల నుంచి పిక్కలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతు భరోసాపై నోరు విప్పని కూటమి ప్రభుత్వం



గత వైఎస్సార్‌సీపీ హయంలో రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం అందించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలపై కనీసం నోరు మెదపలేదు. ఎన్నికల ముందు రైతులను అన్ని విధాలుగా అదుకుంటామని హామీ ఇచ్చి మరిచారు. వ్యవసాయం సాగుచేసే రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నారు.

– సాగిన లక్ష్మణమూర్తి ఎంపీపీ, నాతవరం మండలం

జీడి రైతులను ప్రభుత్వం అదుకోవాలి



జీడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలి. రైతులు పండించిన జీడి పిక్కలను దళారులు, ప్రైవేటు వ్యాపారులు లేకుండా ప్రభుత్వమే నేరుగా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి. మంచు కారణంగా దిగుబడి తగ్గిన జీడి రైతులకు ఆర్థికసాయం అందించాలి. జీడి దిగుబడులు పెంచేందుకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకురావాలి

– బాలేపల్లి వెంకటరమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి

‘గిరిజనుల సాగులోని భూ రికార్డులు మార్చేశారు..’



తహసీల్దార్ శ్రీనివాసరావును నిలదీస్తున్న గిరిజన సంఘం నేతలు

గొలుగొండ : గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు గిరిజన ప్రజల పట్ల కక్ష కట్టి పెత్తందార్లకు కొమ్ముకాస్తున్నారని గిరిజన సంఘం నేతలు ఆరోపించారు. గొలుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గదబపాలెం గిరిజన భూముల రికార్డుల మార్పులపై ఆందోళన చేశారు. పాతమల్లంపేట పంచాయతీ శివారు గదబపాలెం పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 850లో సుమారుగా 23 ఎకరాల భూములు గిరిజనుల సాగులో ఉండగా ఇతర దేశాల్లో ఉన్న వారి పేర్లను తహసీల్దార్ శ్రీనివాసరావు రికార్డుల్లో చేర్చడంపై మండిపడ్డారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న గిరిజనులకు నోటీసులు ఇవ్వకుండా ఇతర దేశాల్లో ఉన్న వారికి ఎలా కట్టపెడతారని నిలదీశారు. దీనిపై డివిజన్, జిల్లా స్థాయిలో పోరాటాలు చేస్తామని ఏకపక్షంగా వ్యవహరించిన తహసీల్దార్ శ్రీనివాసరావుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతుల రక్షణకు ముసాయిదా చట్టం కావాలి



కె.కోటపాడు తహసీల్దార్ వినతిపత్రంను అందిస్తున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : కౌలు రైతుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో ముసాయిదా చట్టాన్ని తీసుకురావాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందించారు. నాయినిబాబు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతులకు మేలు చేసేలా చట్టాలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇపుడు 10 నెలలు గడుస్తున్నా కౌలు రైతు చట్టం చేయలేదని ఆరోపించారు. ఈ కారణంగా కౌలు రైతులు ప్రభుత్వ పరంగా ఎటువంటి సహకారం పొందలేకపోయారని తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రావికమతం : ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని మరుపాక ఏపి మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ కె. సత్యసునీల్ కోరారు. ఈ నెల 17 నుంచి మే 22 వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తుతో పాటు ఈ ఏడాది పదో తరగతి పరీక్ష హాల్ టికెట్ కూడా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు 150 రూపాయలు ఫీజు, ఇతరులకు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. మోడల్ స్కూల్లో ఎంపీపీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయని, గ్రూపుల్లో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్నపూర్ణదేవి భోజనశాల ప్రారంభం



మాడుగులలో భోజనశాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల : షిర్డిసాయిబాబా ఆలయ ప్రాంగణంలో, షిర్డిసాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణ దేవి భోజనశాల, సామాజిక భవనం, ధ్యానయోగ మందిరం సోమవారం ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులు ముద్దుల సత్యనారాయణ, ముద్దుల కొండలరావు, రాధిక దంపతులు ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ టి. రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, బీజేపీ నాయకులు పుట్టా గంగయ్య, వార్డు సభ్యులు జె.వరహాలు, సభ్యులు ముద్దుల సోమేశ్‌బాబు, ముద్దల రాధికరాణి, జె. సంతోష్, ముద్దుల రమేష్ బాబు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఎస్. సతీష్, కమిటీ ప్రతినిధులు డి.సుబ్బరత్నమ్మ, జగన్, ఎస్.వి.రమణ, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో 15 మేకలు మృతిచెందినట్టు గుర్తింపు

బాధితుడికి పరిహారం అందించాలని వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్



మృతి చెందిన మేకలను గుర్తిస్తున్న పశువైద్యాధికారి, నాయకులు

బుచ్చెయ్యపేట : రాజుపాలెం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 15 మేకలు మృతి చెందినట్టు పశువైద్యాధికారులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు నమ్మి పైడయ్య, చిలుకులకు చెందిన మూడు పాకలు కాలిపోగా పాకలో ఉన్న మేకలు సజీవ దహనమయ్యాయి. సోమవారం రాజాం పశువైద్యాధికారి రాము బగాది తమ సిబ్బందితో వెళ్లి మృతి చెందిన మేకలను గుర్తించి మేకలకు శవ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. దీనిపై సర్పంచ్ గోకివాడ వరక్రిష్ణ, ఎంపీటీసీ రాము, నాయకులు నేమాల సత్యనారాయణ, లాలం నాయుడు, గోకివాడ నాయుడు, సాగిరాజు సన్యాసిరాజు, కోరుబిల్లి రాము తదితరులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మేకలు, గొర్రెలు, పశువులకు ఉచితంగా బీమా కట్టి ప్రమాదం జరిగినపుడు బాధితులకు పరిహారం అందించేవారన్నారు. ఇపుడు 15 మేకలు మృతి చెందితే ప్రభుత్వం పరిహారం అందించకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం బాధితుడికి పరిహారం అందించాలన్నారు.

పంచాయతీల అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి

దేవరాపల్లి : పంచాయతీల అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు అధ్యక్షతన అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు బ్లాక్ పంచాయితీ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పంచాయతీల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యం ప్రకారం తాగునీటి బోర్లు, సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాల మరమ్మతులు, చెత్త సంపద కేంద్రం అభివృద్ధి తదితర పనులతో ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ఏడాది 15 వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.80 లక్షల మేర మంజూరయ్యే అవకాశం ఉందని, ఈ నిధులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాభవానీ, ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్, ఎం.అలమండ, చింతలపూడి, తెనుగుపూడి ఎంపీటీసీలు పోతల వెంకటరావు, పొట్నేళ్ల ఈశ్వరమ్మ, బండి గౌరమ్మ, పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, విద్యుత్ ఏఈ కె.శంకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం ప్రభాకర్, హౌసింగ్ ఇంచార్జ్ భవ్య తేజ, ఏపీవో చంద్రకళ పాల్గొన్నారు.

విద్యార్థులకు గాయిటర్ పరీక్షలు



రాచపల్లిలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ధీరజ్

మాకవరపాలెం: రాచపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకు గ్రంధి వాపు (గాయిటర్) నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నేషనల్ అయోడిన్ డెఫిసెన్సీ డిసార్డర్ ప్రోగ్రాం(ఎన్‌ఐడీడీపీ)లో భాగంగా సోమవారం ఈ పాఠశాలల్లో 6 నుంచి 12 ఏళ్లలోపు విద్యార్థులకు గ్రంధి వాపు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ధీరజ్ గాయిటర్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ప్రభాకర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంబీపట్నం పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి అనూష

నాతవరం : విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యల నివారణకు ముందుగా పరీక్షలు చేస్తున్నామని గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి చిటికెల అనూష అన్నారు. ఎం.బి.పట్నం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు యూరిన్ తదితర పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు గాయిటర్ వ్యాధి నివారణకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు అయోడైజ్ సాల్ట్‌ని వాడలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్‌లు సిహెచ్.నాగేశ్వరరావు జి.వెంకటలక్ష్మి సూపర్ వైజర్లు శ్యామ్‌సుందర్, గంగ పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

దేవరాపల్లి : ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలానికి వివిధ రకాల 74 వ్యవసాయ పరికరాలను కేటాయించిందన్నారు. బ్యాటరీ స్ప్రేయర్‌కు రూ.1000, పవర్ అపరేటెడ్ స్ప్రేయర్‌కు రూ. 8 వేలు, రోటా వేటర్‌కు రూ.46 వేలు, పవర్ వీడర్‌కు రూ.35వేలు, బ్రష్ కట్టర్‌కు రూ. 36 వేలు, పవర్ టిల్లర్‌కు లక్ష రూపాయలు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. ట్రాక్టర్‌కు సంబంధించి దుక్కు, దమ్ము సెట్లు ఇతర పరికరాలకు పొందేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసిన ట్రాక్టర్ కలిగి ఉండాలన్నారు. సన్న చిన్నకారు రైతులు ఐదు ఎకరాల లోపు భూమి కలిగి ఉండడంతో పాటు సాగు చేస్తూ ఉండాలన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం



నర్సీపట్నంలో పరీక్షలకు హాజరైన విద్యార్థినులు



మాకవరపాలెంలో విద్యార్థులను తనిఖీలు చేస్తున్న మహిళా పోలీసులు



కె.జె.పురం హైస్కూల్లో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



బుచ్చెయ్యపేటలో ప్రమాదంలో కాలు విరిగిన స్నేహితురాలిని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న తోటి విద్యార్థులు



పరీక్షకు వెళ్తున్న ఎ.కోడూరు వసతిగృహ విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెబుతున్న సిబ్బంది



రోలుగు పది పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న కొత్తకోట సీఐ కోటేశ్వర్రావు



చీడికాడ కేంద్రం వద్ద విద్యార్థులు



దేవరాపల్లి పరీక్ష కేంద్రానికి ఐసీయూ నుంచి తల్లి సహాయంతో పరీక్షకు హాజరైన బేతపూడి కేజీబీవీ విద్యార్థిని తనూశ్రీ

నర్సీపట్నం: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం మున్సిపాలిటీ, రూరల్ మండలంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. నర్సీపట్నం జెడ్పీ బాలికల హైస్కూల్, గవర్నమెంట్ హైస్కూల్, జెడ్పీ మెయిన్ స్కూల్, నారాయణ, శ్రీచైతన్య, డాన్‌బాస్కో సెంటియన్స్, వేములపూడి జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్ కేంద్రాల్లో 1853 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1842 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో సిహెచ్.తలుపులు తెలిపారు. పరీక్షల సమయం ఉదయం 9.45 గంటలు కాగా విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రధాన గేట్ల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీచేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పెట్టారు.

మాకవరపాలెం: మండలంలో తామరం కృపాకమల్ స్కూల్లో 251 మంది, మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 201 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రంలోనికి అనుమతించారు. మొత్తం 452 మందికిగాను 445 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు హాజరైనట్టు ఎంఈవో మూర్తి తెలిపారు.

703 మంది హాజరు

మాడుగుల రూరల్: మండలంలో సోమవారం ఐదు పరీక్ష కేంద్రాల ద్వారా టెన్త్ తెలుగు పరీక్షకు 703 మంది హాజరయ్యారు. ఐదుగురు ప్రైవేటు విద్యార్థులకు ఒకరు మాత్రమే హాజరయ్యారు. కె.జె.పురం పరీక్ష కేంద్రంలో 159 మందికి, 159 మంది, ఒమ్మలిలో 153 మందికి, 153 మంది హాజరయ్యారు. తాటిపర్తి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో 151 మందికి 149 మంది హజరయ్యారు. మాడుగుల బాలుర హైస్కూలు కేంద్రంలో 105 మందికి ఒకరు గైర్హాజరవ్వగా, బాలికల పాఠశాల కేంద్రంలో 138 మందికి పూర్తిగా హాజరయ్యారని ఎంఈవో–2 బి. దేముడమ్మ సోమవారం తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్యసేవలు అందుబాటులో ఉంచారు. తాటిపర్తి పరీక్ష కేంద్రంలో పరీక్షలకు హాజరయ్యే వారి కోసం ఆర్టీసి ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.

కె.కోటపాడు : పదో తరగతి పరీక్షలకు స్థానిక హైస్కూల్‌లో గల పరీక్ష కేంద్రంలో 149 మందికి ఒకరు, వేణు విద్యానికేతన్ పాఠశాలలో 161 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. ఎ.కోడూరు హైస్కూల్లో 175 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎ.కోడూరు వసతిగృహం నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సోమవారం ఉదయం వసతిగృహాధికారులు పి.గంగునాయుడు, రమేష్ ఆల్‌ద బెస్ట్ చెప్పి పరీక్ష కేంద్రాలకు తీసుకువెళ్లారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా పోలీసులు పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్‌ను అమలు చేసినట్టు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు.

బుచ్చెయ్యపేట : మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో 415 మంది పది పబ్లిక్ పరీక్షలకు హాజర్వాల్సివుండగా మొదటి రోజు 408 మంది హాజరయ్యారని, ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. వడ్డాదిలో 278 మందికి నలుగురు, దిబ్బిడిలో 137 మందికి ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదు. సీతయ్యపేట, రాజాం పరిధిలో పదో తరగతి విద్యార్థులు అనకాపల్లి మండలం కూండ్రం పాఠశాలలో పరీక్షలు రాశారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు రెండు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోలుగుంట : రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం తొలి రోజు తెలుగు పరీక్షకు 245 మందికిగాను 243 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో 11 రూములు కేటాయించగా తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్‌లు, బెంచీలు, ఫస్ట్ ఎయిడ్ కోసం వైద్య సిబ్బంది, మందులు అందుబాటులోఉంచారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా దాడిశెట్టి రమేష్ కుమార్, డీవోగా కృష్ణకుమారి వ్యవహరించారు.

➡ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని కొత్తకోట సీఐ కోటేశ్వర్రావు సోమవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. కాపీయింగ్ జరగకుండా గట్టి నిఘా ఉంచాలని సూచించారు. హైస్కూలు సమీపంలో గల జెరాక్సు షాపులను మూయించారు. ఎస్ఐ రామకృష్ణారావు ఆయన వెంట ఉన్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెనుగుపూడి డా. బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలోను టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఈ రెండు పరీక్షా కేంద్రాలలో 434 మంది విద్యార్థులకు ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. దేవరాపల్లి హైస్కూల్లో 230 మంది పూర్తిగా పరీక్షకు హాజరు కాగా, తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో 204 మంది విద్యార్థులకు ఒకరు హాజరుకాలేదు. కేజీబీవీ విద్యార్థిని దాసరి తనూశ్రీ పచ్చకామెర్లు, తీవ్రమైన కడుపునొప్పితో ఆరు రోజుల నుంచి మారికవలస ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతోంది. సోమవారం పరీక్షలు ప్రారంభమవ్వడంతో వైద్యుల అనుమతితో ఐసీయూ నుంచి నేరుగా తల్లి సత్యవతి సహాయంతో దేవరాపల్లి పరీక్ష కేంద్రానికి చేరుకొని పరీక్షలు రాసింది.

12 మంది గైర్హాజరు

రావికమతం : మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో తలుపులు తెలిపారు. కొత్తకోట, దొండపూడి, రావికమతం హైస్కూల్లో, మరుపాక మోడల్‌ను 10వ తరగతి పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. సోమవారం తెలుగు పరీక్షకు 815 మంది రెగ్యులర్ విద్యార్థులు, నలుగురు ప్రైవేట్ విద్యార్థులతో కలిపి 819 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. వీరిలో 8 మంది రెగ్యులర్ విద్యార్థులు , నలుగురు ప్రైవేట్ విద్యార్థులు హాజరు కాలేదని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

చీడికాడ: చీడికాడ,మంచాల,కోనాం పరీక్ష కేంద్రాలలో 470 మంది రెగ్యులర్ విద్యార్థులు, చీడికాడ ప్రైవేట్ సెంటర్‌లో 17 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా కోనాం, చీడికాడ కేంద్రాల్లో ఒక్కొక్కరు గైర్హాజరైనట్టు ఆయా కేంద్రాల డీవోలు తెలిపారు.

రేషన్‌కార్డు లబ్ధిదారులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

దేవరాపల్లి: మండలంలోని రేషన్‌కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారు ఈ నెల 31లోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని దేవరాపల్లి తహసీల్దార్ పి.లక్ష్మీదేవి సూచించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డులోని ఐదేళ్ల పైబడి, 60 ఏళ్ల లోపు వయసు కలిగిన వారంతా సమీప రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ పెండింగ్ లబ్ధిదారుల జాబితా రేషన్ డీలర్ల వద్ద ఉందని, నిర్ణీత గడువులోగా చేయించుకోవాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈకేవైసీ చేయించుకోని వారికి నిత్యవసర సరుకులు పంపిణీ నిలిపివేయడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

చోడవరం : చోడవరం పట్టణంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ప్రముఖ సంఘసేవకుడు, కన్నడ సినీ నటుడు దివంగత పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు బ్లడ్ డోనర్స్ అసోసియేషన్, విశాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 76 మంది యువతీ, యువకులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. పునీత్‌రాజ్ చేసిన సేవలను ఈ సందర్భంగా వారంతా కొనియాడారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిప్యూటీ ఈఈ గౌరీప్రసాద్, ఎల్ఐ రవికుమార్, సంఘ అధ్యక్షుడు గొలుకొండ గణేష్, సాంబరి శ్రీను, బీల సతీష్, యుగంధర్ తదితరులు పాలొన్నారు.